క్లుప్తంగా

సాయి లక్కరాజుకు కళాదర్బార్ పురస్కారం



తెనాలి: గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో గల అన్నమయ్య కళావేదికలో కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెనాలికి చెందిన స్వర లయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజుకి కళారంగంలో చేస్తున్న విశిష్ట కృషికి ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆలయ కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పొత్తూరి రంగారావులు సాయి లక్కరాజును సత్కరించి, ఉగాది పురస్కారాన్ని బహూకరించారు. తనకు జరిగిన సత్కారానికి సాయి లక్కరాజు స్పందిస్తూ తన జిల్లాలో జరిగిన సత్కారం కన్నతల్లి అందించిన అభినందనలతో సమానమన్నారు.

94.71 శాతం పింఛన్లు పంపిణీ



తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలి పట్టణంలో మంగళవారం ప్రారంభమైంది. పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలో ఉద్యోగులు ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. పట్టణంలో మొత్తం 15,023 పింఛన్లకు గాను సాయంత్రం 6 గంటల సమయానికి 14,228 పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మిగిలిన పింఛన్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. పట్టణంలో పలు చోట్ల జరుగుతున్న పింఛన్ల పంపిణీని అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు చోరీపై కేసు



తెనాలిరూరల్: ఏటీఎం వద్ద వృద్ధుడి దృష్టి మరల్చి ఆయన ఏటీఎం కార్డు అపహరించి నగదు దోచుకున్న నిందితుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో ఏటీఎం వద్ద ఓ వృద్ధుడు ఇటీవల డబ్బులు విత్‌డ్రా చేసుకుంటున్నాడు. అదే సమయంలో ఏటీఎంలోకి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తి వృద్ధుడి ఏటీఎం పిన్ నంబరు పసిగట్టాడు. పక్కకు రమ్మంటూ హడావుడి చేసి కార్డు తీసి వేరే కార్డు మార్చి వృద్ధుడికి ఇచ్చి పంపాడు. అనంతరం పలు విధాలుగా రూ.1.15 లక్షలు విత్‌డ్రా చేసుకున్నాడు. గుర్తించిన వృద్ధుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశామని వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని, వివరాలు తెలిసిన వారు 9440796218 నంబరులో సంప్రదించాలని కోరారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురి అరెస్ట్

మంగళగిరి: పట్టణంలోని నిడమర్రు గ్రామ పరిధిలో ఉన్న టిడ్కో నివాసాల వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బహిరంగంగా మద్యం సేవించి, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేసి, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి బహిరంగంగా మద్యం సేవించేవారిని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిని అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో గుర్తు తెలియని వృద్ధరాలి మృతదేహం లభ్యమైంది. సుమారు 65 సంవత్సరాల వయస్సున్న వృద్ధురాలు చలపతి కళాశాల ఎదురుగా ఉన్న ఆర్‌ఆర్ విల్లాస్ ఎదురుగా మృతి చెంది పడి ఉన్నట్లు గుర్తించిన తాడికొండ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వాసు స్పందిస్తూ.. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

లక్ష్యం కంటే మిన్నగా..

- 120 రకాల వ్యవసాయ ఉత్పత్తులపై శిస్తు వసూలు
- తెనాలి యార్డు పరిధిలో నాలుగు చెక్ పోస్టుల నిర్వహణ
- యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి జె.వెంకటసుబ్బారావు



తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు

తెనాలిటౌన్: 2024–25 సంవత్సరానికి గాను నిర్దేశించిన లక్ష్యాన్ని మించి రికార్డు స్థాయిలో తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు శిస్తు వసూలు అయినట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి జె.వెంకట సుబ్బారావు తెలియజేశారు. 120 రకాల వ్యవసాయ ఉత్పత్తులపై శిస్తు విధిస్తారని చెప్పారు. తెనాలి యార్డు పరిధిలో నాలుగు చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రేడర్స్, చెక్ పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.6 కోట్ల 70 లక్షలు శిస్తు వసూలు అయిందని వివరించారు. ప్రభుత్వం యార్డుకు రూ.6 కోట్ల 60 లక్షలు టార్గెట్ ఇవ్వగా నిర్దేశించిన లక్ష్యాన్ని మించి వసూలు అయినట్లు తెలిపారు. గత ఏడాది రూ.6 కోట్ల 34 లక్షలు మాత్రమే వసూలు అయ్యాయని చెప్పారు. బుర్రిపాలెం, నందివెలుగు, తెనాలి, పెదరావూరు చెక్ పోస్టుల ద్వారా నిరంతరాయంగా శిస్తు వసూలు చేసినట్లు తెలియజేశారు. ధాన్యం, జొన్న, మొక్కజొన్న ఇలా అనేక రకాల వ్యవసాయ ఉత్పత్తులపై శిస్తు వసూలు చేస్తామని తెలిపారు. సిబ్బంది సమష్టి కృషితో నిర్దేశించిన లక్ష్యం సాధ్యపడిందని అన్నారు.

7,500 మెట్రిక్ టన్నుల గోడౌన్ ఖాళీ



జొన్న, మొక్కజొన్న, ఇతర అవసరాలకు అద్దె ప్రాతిపదికన ఖాళీగా ఉన్న గోడౌన్‌లు ఇవ్వనున్నట్లు యార్డు కార్యదర్శి వెంకట సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వ అవసరాలు, ప్రైవేటు అవసరాలకు ఇస్తామని వివరించారు. వ్యాపారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– జె.వెంకటసుబ్బారావు
యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి

యార్డు పరిధిలో 17 గోడౌన్‌లు

యార్డు పరిధిలో 17 గోడౌన్‌లు ఉండగా 400 మెట్రిక్ టన్నులు–4, 600 మెట్రిక్ టన్నులు–9, 1000 మెట్రిక్ టన్నులు–2, 3000 మెట్రిక్ టన్నులు–1, 5000 మెట్రిక్ టన్నులు–1 ఉన్నాయి. వీటిలో 7 వివిధ రకాల ఉత్పత్తులతో నిండి ఉండగా 8 ఖాళీగా ఉన్నాయి. ఎరువులు, ధాన్యం, సిమెంట్, రైస్, ప్రైవేట్ మెటీరియల్ ఉన్నట్లు తెలిపారు.

ఇందిరానగర్ కాలనీలో మిన్నంటిన రోదనలు

ఎలక్ట్రీషియన్ రవీంద్ర, అతని భార్య, మనుమడు, మనుమరాలి అంత్యక్రియలు పూర్తి



ఒకే బాక్సులో ఉంచిన సాత్విక, షణ్ముఖ్ మృతదేహాలు

తెనాలిరూరల్: తెనాలి చెంచుపేట ఇందిరానగర్ కాలనీ రోదనలతో మిన్నంటింది. కృష్ణా జిల్లాలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురి మృతదేహాలు స్వస్థలం తెనాలికి మంగళవారం చేరుకున్నాయి. తెనాలికి చెందిన గిడుగు రవీంద్రమోహన్‌బాబు కుటుంబం కృష్ణా జిల్లా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురవడం, ప్రమాదంలో రవీంద్ర సహా అతని భార్య, మనుమరాలు, మనుమడు మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం వారి భౌతికకాయాలు తెనాలి తీసుకొచ్చి ఇందిరానగర్‌లోని నివాసం వద్ద ఉంచారు. మృతదేహాలను చూసి బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. రోదనలతో ఈ ప్రాంతం మిన్నంటింది. మూడు నెలల షణ్ముఖ్‌తో పాటు అక్క సాత్విక మృతదేహాన్ని కూడా ఒకే మార్చురీ బాక్స్‌లో ఉంచారు. పక్కపక్కనే ఉన్న చిన్నారుల మృతదేహాలు చూసిన స్థానికులు బోరున విలపించారు. రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలోని శ్మశానవాటికలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా రవీంద్ర కొడుకు సందీప్, కోడలు పల్లవి విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



తెనాలిఅర్బన్: పదవ తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 17న పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజు చిన్న అపశ్రుతి చోటు చేసుకున్నప్పటికి చివరి రోజు వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. తెనాలి పట్టణ, మండల పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 3,224 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా చివరి రోజు 3,144 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు క్రెడిట్ క్యాంప్

తెనాలిటౌన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధ, గురువారాల్లో క్రెడిట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలానికి బీసీ, ఈబీసీ, ఓసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి 100 మందికి సబ్సిడీపై రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్దేశించగా 834 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు క్రెడిట్ క్యాంపు జరుగుతుందని చెప్పారు. క్యాంప్‌లో 9 బ్యాంక్‌లకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పత్రాలతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• ఎక్కడి వ్యర్థాలు అక్కడే..!



యడ్లపాటి వెంకట్రావు రోడ్డులో గుట్టగా పేరుకుపోయిన వ్యర్థాలు

తెనాలిటౌన్: కాల్వలో పూడిక తీసిన వ్యర్థాలను రోజుల తరబడి ఇళ్ల ముంగిట ఉంచుతున్నారని, వీటి వలన దుర్గంధం వెదజల్లి అనారోగ్యం పాలవుతున్నట్లు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. బుర్రిపాలెం రోడ్డు శివారు యడ్లపాటి వెంకట్రావు రోడ్డు మొదలులో రోడ్డు వెంబడి కాల్వలో తీసిన వ్యర్థాలు ఇళ్ల ముంగిట గుట్టలుగా వేశారు. వీటి నుంచి వచ్చే దుర్గంధం భరించలేక ప్రజలు మున్సిపల్ అధికారులను తిట్టిపోస్తున్నారు. సకాలంలో స్పందించి ఇళ్ల ముందు పోసిన వ్యర్థాలను తొలగించాలని శానిటేషన్ అధికారులను కోరుతున్నారు.

మొక్కలు మనకు నేస్తాలు

తాడేపల్లి రూరల్ : మొక్కలు మానవులకు నేస్తాలని, మొక్కలు లేకపోతే జీవించలేమని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకుడు పురాణం వెంకటాచార్యులు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ఆశ్రమంలో వేద విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు మొక్కలు నాటడం అలవాటు చేయాలని, రేపటి తరానికి చెట్ల ప్రాధాన్యతను వివరించాలన్నారు.

ఘనంగా ఈదుల్ ఫిత్ర్

వక్ఫ్ చట్టం సవరణను వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలు, రిబ్బన్లు



చెంచుపేటలోని ఈద్‌గాలో ముస్లింల ప్రార్థనలు



ప్రార్థనలు చేయిస్తున్న ఇమామ్ షేక్ ఇమ్రాన్


తెనాలి: ఈదుల్ ఫిత్ర్ పర్వదిన వేడుకలను సోమవారం పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని 23 మసీదుల పరిధిలోని ముస్లింలు ఉదయాన్నే నూతన వస్త్రాలను, తలపై టోపీలను ధరించి, పరిమళ భరిత అత్తరును రాసుకుని, సంప్రదాయం ప్రకారం సేమియా పాయసం, ఖర్జూరాన్ని ఆరగించారు. 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ లాఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్‌హంద్' అని పఠిస్తూ ఉదయం 9.30 గంటలకే చెంచుపేటలోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. పాండురంగపేట మక్కా మసీదు ఇమామ్ షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సమీపంలోని ముస్లింల శ్మశానవాటికకు చేరుకుని పెద్దల సమాధులపై పూలు చల్లి నివాళులర్పించారు. వక్ఫ్ చట్టం సవరణ–2024ను వ్యతిరేకిస్తూ పలువురు నమాజీలు నల్ల బ్యాడ్జీలు ధరించగా, మరికొందరు చేతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని వచ్చారు.

ప్రార్థనలకు భారీ ఏర్పాట్లు

ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం ఈద్‌గాలో భారీ ఏర్పాట్లు చేశారు. నమాజీలకు పది వేల వాటర్ బాటిళ్లతోపాటు స్వీటు, హాట్ ప్యాకెట్లను పంచారు. 110 భారీ కూలర్లు, ఏడు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, డ్రోన్ల సాయంతో కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. పెండ్యాల ఖానా షామినాయాలు, నేలపై గ్రీన్‌మాట్లు, భక్తి భావనను పెంచే ఫ్లెక్సీలు, నమాజ్ చేయడానికి ముందు కాళ్లు చేతులు శుభ్రం చేసుకునే 'వజూ' కోసం కుళాయిలను అందుబాటులో ఉంచారు. 1,500 కిలోల పుచ్చకాయ ముక్కలను నమాజీలకు పంపారు.

పలు మసీదుల్లో నమాజు

రంజాన్ పర్వదినం రోజున గతంలో చెంచుపేటలోని ఈద్గా మైదానంలోనే పట్టణంలోని ముస్లింలందరూ నమాజ్ చేసేవారు. పెరిగిన ముస్లిం జనాభా అవసరాలకు అనుగుణంగా ఇప్పుడు పలుచోట్ల ఈద్ నమాజ్ చేశారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని చారిత్రక జామియా మసీదులో హాఫీజ్ ఇమ్రాన్, వహాబ్ రోడ్డులోని మదీనా మసీదులో ముఫ్తీ ఉస్మాన్ సాహెబ్, ఇస్లాంపేటలోని మర్కజ్ మసీదులో ముఫ్తీ అబ్దుల్లా, పెదరావూరు ఈద్‌గాలో ముఫ్తీ అల్లావుద్దీన్, చినరావూరు ఈద్‌గాలో ముఫ్తీ అబ్దుల్ హఫీజ్, పినపాడు ఈద్‌గాలో ముఫ్తీ షాహిద్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు నమాజు చేశారు.



పెద్దల సమాధులపై పూలు చల్లుతున్న ముస్లింలు



వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ ఎమ్మెల్సీ ఆలపాటి రాజాకు వినతి

ఎమ్మెల్సీ ఆలపాటికి వినతిపత్రం

చెంచుపేటలోని ఈద్‌గాకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వచ్చారు. ముస్లిం సోదరులకు ఈదుల్ ఫిత్ర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మజ్లిసుల్ ఉలమా–వల్ అయిమ్మా, జమియతే ఉలమా హింద్, తెనాలి సంస్థల ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టం సవరణను వ్యతిరేకిస్తూ తెనాలి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఉద్దేశించిన వినతి పత్రాన్ని ఆలపాటి రాజాకు అందజేశారు.

కాశీ మహోత్సవంపై ప్రవచనం



ప్రవచనం చెబుతున్న సామవేదం షణ్ముఖశర్మ, హాజరైన భక్తులు

తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని దుర్గాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి మహోత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దేవస్థానం ప్రాంగణంలోని లలితాధామం వేదికపై ప్రముఖ ఆధ్యాత్మిక పండితుడు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ 'కాశీ మహోత్సవం'పై ప్రవచనం చెప్పారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో ఆలకించారు. బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ, వేద పండితుడు విష్ణుభట్ల ఆంజనేయ శర్మ, ఆలయ అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర శివప్రసాద్ పాల్గొన్నారు. పుచ్చ శైలజ, గోపాలకృష్ణలు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికుల కాంట్రాక్ట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వవద్దు

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

తెనాలిఅర్బన్: మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల కాంట్రాక్ట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం చూస్తుందని, దీనిని సీఐటీయూ వ్యతిరేకిస్తుందని జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టర్‌లకు కట్టబెట్టి, కార్మికులను బానిసలుగా చేయవద్దనే నినాదంతో ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్, కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కార్మికుల సమస్యలను మంత్రి నారాయణకు తెలియజేయడం జరిగిందని, ఆయన పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులను కాంట్రాక్ట్ ఇవ్వడం వలన సకాలంలో కార్మికులకు వేతనాలు అందవని, ఈ విషయం గతంలో నిర్ధారణ అయిందని, మరలా కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకం బాధాకరమన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలీ మాట్లాడుతూ జనాభా పెరుగుతున్న రీతిలో కార్మికుల సంఖ్య పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే సమ్మెకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.పద్మ, ఎం.మరియమ్మ, ఉన్నవ సుధాకర్, కె.సుశీల, పద్మావతి, నాగరాజు, ఎం.దుర్గాప్రసాద్, పి.మరియమ్మ, అంజి, వి.లక్ష్మీనారాయణ, డి.దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన ఎడ్ల పందేలు



ఆరు పళ్ల విభాగంలో విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యేలు

తెనాలిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన నాలుగో రోజుకు చేరుకుంది. మంగళవారం సాయంత్రం న్యూ కేటగిరీ విభాగం పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో 13 జతల ఎడ్లు పాల్గొనగా రాత్రి 10.30 వరకు పోటీలు కొనసాగాయి. అలాగే సోమవారం రాత్రి ఆరు పళ్ల విభాగం పోటీలు ముగిశాయి. నాలుగో రోజు ముఖ్య అతిథిగా నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఆరు పళ్ల విభాగం విజేతలకు బహుమతులు అందించారు. ఈ విభాగంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసనపల్లి గ్రామంలోని నంది బ్రీడింగ్‌బుల్స్ యజమాని నెలూరి రామకోటయ్య ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3986.06 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు.

ముగిసిన పాల పోటీలు

పశు పాల పోటీలను నిర్వాహకులు సోమవారం సాయంత్రం ప్రారంభించగా, మంగళవారం రాత్రికి ముగిశాయి. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, విశ్రాంత వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఆలపాటి వెంకట్రామయ్య పర్యవేక్షించారు.

పూరిల్లు, గడ్డివామి దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు గ్రామంలో సంగం డెయిరీ కేంద్రం వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు, ఐదు ఎకరాల గడ్డి వామి సోమవారం రాత్రి 12 గంటల సమయంలో అగ్నికి ఆహుతయ్యాయి. దీనిపై స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. తూములూరు గ్రామానికి చెందిన ఆళ్ళ నాగిరెడ్డి పూరిల్లు, ఆరుమళ్ళ వెంకటరెడ్డికి చెందిన ఐదు ఎకరాల గడ్డివామి పూర్తిగా అగ్నికి ఆహుత య్యాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు రావడంతో గ్రామంలోని చుట్టు పక్కల వారు ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేసి తమ వంతు మంటలు ఆర్పడానికి కృషి చేశారు. ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి చేరుకుని కొంత వరకు మంటలను అదుపు చేశారు. పూరిల్లుకు చెందిన నాగిరెడ్డి మాట్లాడుతూ రూ.17వేల నగదు, చెట్లను కోసే యంత్రం, వంట సామాన్లు కాలిపోయినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఆళ్ళ వెంకటరెడ్డి మాట్లాడుతూ తన ఐదు ఎకరాల గడ్డి వామి పూర్తిగా తగలబడిందని, సుమారు రూ.70 వేల గడ్డి బూడిద అయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సిద్ధార్థ, వీఆర్వో శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి నిత్యావసర సరుకులను బాధితులకు అందజేశారు. మంటలు ఆర్పడంలో సహాయం చేసిన రైతులను తహసీల్దార్ అభినందించారు.

నేడు టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపికలు

మేడికొండూరు : మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రన్ను హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో పిడుగురాళ్లలో రాష్ట్ర స్థాయి పోటీలుంటాయని తెలిపారు. వివరాలకు 99661 22055 నంబరుని సంప్రదించాలన్నారు. అండర్ 19 విభాగానికి సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని, ఎంట్రీ ఫీజు రూ.100లని తెలిపారు.

7 నుంచి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్ సబ్జెక్టులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీషు, గ్రామర్, పబ్లిక్ స్పీకింగ్, అడ్వాన్స్‌డ్ ఇంగ్లీషులో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణకు పది, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. 6వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

స్కేటింగ్ క్రీడాకారుడికి అభినందన

తాడేపల్లి రూరల్ : అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు తాడేపల్లి డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల ఆశిష్‌ను టీడీపీ నాయకులు మంగళవారం అభినందించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ తైవాన్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ఇండియా నుంచి వివిధ విభాగాల్లో సిల్వర్ మెడల్స్ సాధించాడని తెలిపారు.